

ఎన్‌సిసి బాలికలకు శిక్షణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ట్రిపుల్ ఐటీలో 4వ ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ ఎన్‌సిసి విజయవాడ బాలికలకు బుధవారం ఆపద సమయంలో రక్షణ కోసం చేపట్టే కార్యక్రమాలపై శిక్షణ ఇచ్చారు. కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ బలేంద్ర సింగ్, క్యాంప్ ఎసిడెంట్ కెప్టెన్ సుబ్బలక్ష్మి సిహెచ్‌లు ఎన్‌సిసి బాలికలకు శిక్షణ అందించారు. బాలికలు నిర్వహించిన రైఫిల్ షూటింగ్ ఆహుతులను అలరించింది. ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ అమరేంద్ర కుమార్ బాలికలను అభినందించారు. అన్ని అంశాలలో ఎన్‌సిసి బాలికలు ప్రగతి సాధించాలని ఆకాంక్షించారు. ఆపద కాలంలో ఉన్న సమయంలో ఎవరిని వారు రక్షించుకోవడంతో పాటు.. తోటి వారిని రక్షించడం బాధ్యతగా స్వీకరించాలన్నారు. అందుకోసం అనువైన నైపుణ్యాలను ప్రత్యేక శిక్షణ ద్వారా అలవర్చుకోవాలన్నారు. విద్యార్థి దశలో సామాజిక సేవ పట్ల దృష్టి సారించడం ప్రశంసనీయమన్నారు.

సైబర్ టెర్రర్..!



సైబర్ నేరాలు ప్రజలందరినీ తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఆర్థిక నష్టంతోపాటు మానసికంగా తీవ్ర ఆందోళన, ఆవేదనకు కారణమవుతున్నాయి. ప్రభుత్వం ఎన్ని హెచ్చరికలు చేసినా.. మాయమాటలతో విద్యావంతులను సైతం సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించేస్తున్నారంటే అతిశయోక్తి కాదు.

నిత్యావసర వస్తువుగా స్మార్ట్‌ఫోన్

దాని ఆధారంగానే రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు

రోజుకో రీతిన సైబర్ మోసం

ఏలూరు నగరంలోని మూడో పట్టణ పరిధిలో సత్రంపాడు ప్రాంతానికి చెందిన మహిళ ఓ కళాశాలలో ప్రొఫెసర్‌గా పని చేస్తోంది. ఆమెకు ఓ వీడియో కాల్ వచ్చింది. అటువైపు ఉన్న వ్యక్తి పోలీస్ యూనిఫామ్ ధరించి 'మీ పేరుపై ఒక పార్శిల్ వచ్చింది, ఆ పార్సిల్‌లో సంఘ విద్రోహ కార్యకలాపాలకు పాల్పడే వస్తువులు లభించాయి. వెంటనే పోలీస్ స్టేషనుకు రావాలి' అని బెదిరించారు. అలా రాలేమంటే తమ ఖాతాకు నగదు జమ చేయాలని ఘీంకరించారు. దీంతో భయాందోళనకు గురైన ఆమె దఫదఫాలుగా సుమారు రూ.11 లక్షలు వారి ఖాతాలోకి జమ చేసింది. చివరికి అనుమానం వచ్చి, తాను మోసపోయాయనని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఏలూరులోని ఓ రిటైర్డ్ ఉద్యోగి సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మి మొదట ఆన్‌లైన్ ట్రేడింగ్ ద్వారా కొంత సొమ్మును ఇన్వెస్ట్ చేశాడు. తర్వాత ఆ సొమ్ము రెట్టింపయ్యాయని ఫోన్‌కు మెసేజీ వచ్చింది. ఆ సొమ్ము పొందాలంటే కొంత సొమ్ము చెల్లించాలని ఆగంతకులు తెలిపారు. దీంతో అతను వారు కోరిన సొమ్ము జమ చేశాడు. అయినప్పటికీ టెక్నికల్ ఎర్రర్ వల్ల ఖాతాలో సొమ్ము జమ కాలేదని, మొత్తం సొమ్ము తిరిగి పొందాలంటే కచ్చితంగా మరికొంత సొమ్ము చెల్లించాల్సిందేనని వారు తెలిపారు. అలా దఫదఫాలుగా అతను రూ.తొమ్మిది లక్షలు చెల్లించాడు. ఆపై వారి ఫోన్లు పని చేయకపోవడంతో అనుమానం వచ్చి పోలీసులను ఆశ్రయించాడు.

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఇటువంటి ఘటనలు పలు రూపాల్లో జరుగుతుండటం, రోజురోజుకీ సరికొత్త రూపాల్లో సాగుతుండటం అందరినీ ఆందోళనకు గురి చేస్తోంది. వాటిలో మొదటి రకం ఆన్‌లైన్ ట్రేడింగ్ ఇన్వెస్టుమెంట్, ఆన్‌లైన్‌లో ట్రేడింగ్ ద్వారా సొమ్ము చెల్లిస్తే గంటల వ్యవధిలో వాటికి వడ్డీతో సహా పెద్దమొత్తంలో సొమ్ము జమవుతుందని నమ్మబలుకుతాడు. మొదట ఇన్వెస్ట్ చేసిన అనంతరం మన సొమ్ముకు కొంత సొమ్ము అదనంగా కలిపి మన ఖాతాలో జమ చేస్తారు. దీంతో ఇది నమ్మిన మనం తిరిగి మళ్లీ ఆ ఖాతాలో సొమ్ము ఇన్వెస్ట్ చేస్తాం. డబ్బులు ఒకసారిగా పెరిగి ఖాతాలో జమ కావడంతో పెద్ద మొత్తంలో ఇన్వెస్ట్ చేస్తారు. అయితే ఈసారి అవి మన ఖాతాలో జమ కావు. అవి జమ కావాలంటే తిరిగి మళ్లీ కొంత సొమ్ము చెల్లించాలని అడుగుతారు. మనం సొమ్ము జమ చేసినా మన ఖాతాలోకి రావు. ఇలా ఎంతోమంది లక్షలాది రూపాయలను పోగొట్టుకున్న వారు ఉన్నారు.

సైబర్ ఆన్‌లైన్ ఫ్రాడ్. ఈ క్రమంలో ఒక వీడియో కాల్‌లో యూనిఫామ్ ధరించిన పోలీసు అధికారులు మనకు ఫోన్ చేస్తారు. అతను మన పేరు మీద అనధికార వస్తువులు ఎయిర్‌పోర్టులో, లేదా పార్శిల్‌లో గుర్తించామని, అరెస్టు చేసేందుకు సిద్ధం చేశామని, వెంటనే పోలీస్ స్టేషనుకు రావాలని గంభీరంగా మాట్లాడతారు. బాధితులు తమకేమీ సంబంధం లేదన్నా వినకుండా డబ్బు పంపితే ఈ విషయాన్ని సెటిల్ చేస్తామని చెబుతారు. అది నమ్మిన బాధితుడు దఫదఫాలుగా రూ.లక్షల్లో వారి ఖాతాకు జమ చేస్తాడు. ఇంతకీ అతనిపై ఏ నేరం, ఏ కేసూ ఉండదు.

సైబర్ న్యూడ్ వీడియో కాల్స్ ఫ్రాడ్

ఈ తరహా నేరాల్లో మొదట ఓ గుర్తు తెలియని మహిళ బాధితుడికి ఫోన్ చేస్తుంది. ఆమె ఫోన్ చేసిన సమయంలో ఆమె ఒంటిపై దుస్తులు ఉండవు. ఆమె బాధితుడిని రకరకాల మాటలతో మభ్యపెట్టి అతను కూడా వస్త్రాలు తీసేయాలని చెబుతుంది. బాధితుడు బట్టలు తీశాడో అంతే ఈ వీడియో మొత్తాన్ని సైబర్ నేరగాళ్లు వీడియో కాల్ స్క్రీన్ రికార్డింగ్ చేస్తారు. వాటిని తిరిగి బాధితుడికి పంపి డబ్బులు డిమాండ్ చేస్తారు. ఒకసారి చెల్లిస్తే వారు మళ్లీ మళ్లీ చెల్లించాలని బాధితుడిని పలు రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తూనే ఉంటారు.


కొన్ని రకాలైన ఆన్‌లైన్ మోసాలు ఇలానే సాగుతున్నాయి. ఫ్లిప్‌కార్టు, అమెజాన్‌లోను ఆఫర్లు ఉన్నాయని, స్పిన్ తిప్పితే 70 నుంచి 80 శాతం ఆఫర్లు వస్తాయని నమ్మబలికేలా ప్రచారం చేస్తారు. ఆ లింకును ఓపెన్ చేస్తే ఆఫర్ లభిస్తుందని నమ్మిస్తారు. ఆ లింకును ఓపెన్ చేయగానే మన ఫోన్ మొత్తం సైబర్ నేరగాళ్ల కంట్రోల్‌లోకి వెళ్లిపోతుంది. ఆపై మన బ్యాంకు ఖాతాలో ఉన్న సొమ్మును వారు తమ ఖాతాలకు మళ్లించుకుంటారు.

అప్రమత్తతే కీలకం..

జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్



సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా ఉండాలంటే అప్రమత్తతే కీలకమని జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్ అన్నారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఎవరైనా సైబర్ నేరానికి గురైనట్లు గుర్తించిన వెంటనే సైబర్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని, లేదా 1930 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. తద్వారా సైబర్ పోలీసులు ఆ ఖాతాను ఫ్రీజ్ చేస్తారని, అనంతరం న్యాయస్థానాల సమక్షంలో ఆ సొమ్మును తిరిగి బాధితుల అకౌంట్లకు వచ్చే విధంగా సైబర్ పోలీసులు చర్యలు చేపడతారని తెలిపారు. ప్రజలు ఆఫర్లు ఉన్నాయంటే నమ్మరాదని, అలాగే డబ్బులు ఇన్వెస్ట్ చేస్తే పెద్ద మొత్తంలో డబ్బులు వస్తాయని చెప్పినా నమ్మొద్దని సూచించారు. వీడియో కాల్స్ ద్వారా ఎవరైనా తాము పోలీసులమని, లాయర్లమని, ఎయిర్‌పోర్టు అధికారులమని, ఆర్మీ అధికారులమని వీడియో కాల్స్ చేస్తే వెంటనే స్థానిక సైబర్ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.




ప్రమాణస్వీకార సభలో మాట్లాడుతున్న గన్ని వీరాంజనేయులు

డిసిసిబి ఛైర్మన్‌గా గన్ని ప్రమాణస్వీకారం

తరలొచ్చిన ప్రముఖులు

ప్రతిరైతుకూ మేలు చేయడమే లక్ష్యం


గన్ని వీరాంజనేయులు



బాధ్యతలు స్వీకరిస్తున్న గన్ని వీరాంజనేయులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డిసిసిబి) ఛైర్మన్‌గా గన్ని వీరాంజనేయులు ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక డిసిసిబి ఆవరణలో బుధవారం సాయంత్రం బ్యాంకు సిఇఒ పి.సింహాచలం గన్ని వీరాంజనేయులు చేత ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా గన్నిని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్, ఎంఎల్‌ఎలు బడేటి రాధాకృష్ణయ్య, సొంగా రోషన్‌కుమార్, పత్సమట్ల ధర్మరాజు, ఆరిమిల్లి రాధాకృష్ణ, పితాని సత్యనారాయణ, మద్దిపాటి వెంకటరాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల కార్పొరేషన్ ఛైర్మన్ మంతెన రామరాజు, ఏలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారధి, మాజీ మంత్రి మరడాని రంగారావు, మాజీ ఎంఎల్‌ఎ ఘంటా మురళీ, డిసిసిబి మాజీ ఛైర్మన్ కరాటం రాంబాబు, పలువురు పుష్పగుచ్చాలు అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ ప్రతి రైతుకూ మేలు జరిగేలా రేయింబవళ్లు కృషి చేస్తానన్నారు. ఏలూరు డిసిసిబి ఛైర్మన్ గా ఏలూరు జిల్లాలోని రైతాంగానికి, అదేవిధంగా ఆప్కాబ్ ఛైర్మన్‌గా రాష్ట్రంలోని రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. తన సమర్థతను గుర్తించి ఏలూరు డిసిసిబి ఛైర్మన్‌గా, ఆప్కాబ్ ఛైర్మన్‌గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, కూటమి నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అధికారుల సహకారంతో ఏలూరు డిసిసిబిని లాభాల బాటలోకి తీసుకొస్తానని గన్ని వీరాంజనేయులు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సహకార శాఖాధికారి ఎ.శ్రీనివాస్, డిసిసిబి జనరల్ మేనేజర్ మాధురి, ఎజిఎం శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, కూటమి నేతలు, ప్రముఖులు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకార సభలో మాట్లాడుతున్న చాగంటి మురళీకృష్ణ

డిసిఎంఎస్ ఛైర్మన్‌గా చాగంటి ప్రమాణస్వీకారం

తరలొచ్చిన ప్రజాప్రతినిధులు - పూర్వవైభవం తీసుకొస్తా: చాగంటి మురళీకృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

డిసిఎంఎస్ ఛైర్మన్‌గా చాగంటి మురళీకృష్ణ బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. స్థానిక డిసిఎంఎస్ గ్రాండ్ కన్వెన్షన్ హాల్లో జరిగిన కార్యక్రమంలో మురళీకృష్ణ ప్రమాణస్వీకారం అట్టహాసంగా సాగింది. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్, ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ, ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు, ఎపి కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో కష్టపడిన వారికి పదవులు దక్కుతాయనడానికి నిదర్శనం పశ్చిమగోదావరి జిల్లా అని అన్నారు. మరో 10 సంవత్సరాలు కష్టపడితేనే ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలుస్తుందన్నారు. ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేయాలని, దానికి ప్రజలు సహకరించాలని కోరారు. రాష్ట్రంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా డిసిఎంఎస్‌ను మొదటి స్థానంలో నిలిపేలా నూతన ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ కృషి చేయాలని సూచించారు.

రైతు సంక్షేమానికి కృషి చేస్తా
డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ

రైతులకు అందుబాటులో ఉంటూ, వారి సంక్షేమానికి కృషి చేస్తానని డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ తెలిపారు. తన ప్రజాసేవను గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తనకు డిసిఎంఎస్ ఛైర్మన్‌గా అవకాశం ఇచ్చారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పని చేస్తానన్నారు. డిసిఎంఎస్‌కు పూర్వవైభవం తీసుకొస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ అధికారి ఆరిమిల్లి శ్రీనివాస్, డిసిఎంఎస్ అధికారులు, ఉద్యోగులు, రైతులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

పోడు, ఎల్‌టిఆర్ భూములకు పట్టాలివ్వాలి

ఎస్‌డిసి శ్రీనుకుమార్‌ను సస్పెండ్ చేయాలి

ఆర్‌అండ్‌ఆర్‌లో వివాదాస్పద భూములు కొనొద్దు

ఎపి ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన ఐటిడిఎ వద్ద ధర్నా



ధర్నాలో నినదిస్తున్న నేతలు, గిరిజనులు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములు, ఎల్‌టిఆర్ భూములకు పట్టాలు ఇవ్వాలని, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనుకుమార్‌ను సస్పెండ్ చేయాలని, ఆర్‌అండ్‌ఆర్‌లో వివాదాల్లో ఉన్న భూముల కొనుగోలు ఆపాలని కోరుతూ ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యాన కెఆర్‌పురంలోని ఐటిడిఎ వద్ద బుధవారం పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ధర్నాకు సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ ధర్నానుద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ తరతరాలుగా అడవుల ఆధారంగా జీవిస్తున్న గిరిజనులకు పోడు భూములు పట్టాలివ్వాలని ఆయన డిమాండ్ చేశారు. వివాదాల్లో ఉన్న భూములను ఆర్‌అండ్‌ఆర్‌లో కొనుగోలు చేస్తున్నారని, వాటిని తక్షణమే ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. ఐటిడిఎ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనుకుమార్ గిరిజనేతరులకు తొత్తుగా మారి వారికి అనుకూలంగా ఏకపక్షంగా జడ్జిమెంట్లు ఇస్తున్నారని ఆరోపించారు.య దీనిపై గతంలో ఆయనపై విచారణ నిర్వహించారని, చర్యలు లేకపోవడంతో యథావిధిగా విధుల్లో కొనసాగుతూ మరింత కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఆయనను వెంటనే విధుల నుంచి సస్పెండ్ చేయాలని వారు కోరారు. దీనిపై ఐటిడిఎ పిఒ సమాధానం చెప్పాలని గిరిజన సంఘం నాయకులు పట్టుబట్టారు. దీనిపై ఐటిడిఎ పిఒ రాములు నాయక్ మాట్లాడుతూ కలెక్టర్‌తో మాట్లాడి ఆర్ఒఎఫ్ఆర్ గ్రామసభల షెడ్యూలు ఇస్తామన్నారు. గిరిజనుల సాగులో ఉన్న వివాద భూములను ఆర్‌అండ్‌ఆర్‌లో కొనుగోలు చేయకుండా పై అధికారులకు రాస్తానని తెలిపారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనుకుమార్ అంశం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని, ఆయన కాలంలో వచ్చిన జడ్జిమెంట్లపై విచారణ చేపట్టేలా చర్యలు చేపడతామని అన్నారు. ఈ హామీలపై సత్వరమే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో మరోసారి ఐటిడిఎ వద్ద పెద్దఎత్తున ఆందోళన చేపడతామని నేతలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పోలోజు నాగేశ్వరరావు, తెల్లం దుర్గారావు, కారం భాస్కరరావు, చంద్రు బుల్లెమ్మ, నాగమణి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రమోషన్ల అంశంలో అధికారుల తీరుపై ఎఎన్‌ఎంల ఆగ్రహం

కౌన్సెలింగ్‌కు పిలిచి వాయిదా వేయడంపై నిరసన

ఏలూరు డిఎంహెచ్‌ఒ కార్యాలయం వద్ద ధర్నా

ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్ ఆధ్వర్యాన చర్చలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ


ప్రమోషన్ల విషయంలో ఉన్నతాధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఎఎన్‌ఎంలు స్థానిక డిఎంహెచ్‌ఒ కార్యాలయం వద్ద బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఎఎన్‌ఎంలు మాట్లాడుతూ గత సంవత్సర కాలం నుంచి తమకు ప్రమోషన్లు ఇస్తామని చెప్పి ఎప్పటికప్పుడు నెట్టుకొస్తున్నారన్నారు. సంవత్సరకాలంగా ప్రమోషన్లు లేక జీతం కూడా చాలావరకు నష్టపోతున్నామని వాపోయారు. నిన్నటి వరకు కూడా కౌన్సిలింగ్ జరుగుతుందో లేదో అని సందిగ్ధంలో ఉంచారని, రాత్రికి రాత్రి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని, ఉదయం తొమ్మిది గంటలకల్లా డిఎంహెచ్‌ఒ కార్యాలయంలో హాజరు కావాలని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. సుదూర ప్రాంతాల నుంచి ఉదయమే వచ్చేశామని, అయినప్పటికీ కౌన్సెలింగ్ ప్రారంభించకుండా మధ్యాహ్నం వరకు కూర్చోబెట్టారని వాపోయారు. అనంతరం భోజనాలు చేసి రమ్మని మధ్యాహ్నం నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పారని తెలిపారు. ఇప్పుడు మళ్లీ ఈ నెల 22, 23 తేదీల్లో కౌన్సెలింగ్ అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంవత్సరకాలంగా ఇలానే మభ్యపెడుతున్నారని విమర్శించారు. 276 మంది ఎఎన్‌ఎంల జీవితాలతో ఆడుకోవద్దని, అన్ని జిల్లాలతో సమానంగా ఇక్కడా కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఎపి హెల్త్ సెక్రటరీల యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీలక్ష్మి, జిల్లా గౌరవాధ్యక్షులు డిఎన్‌విడి.ప్రసాద్ నాయకత్వం వహించారు. ఎఎన్‌ఎంలకు సర్దిచెప్పడానికి డిఎంహెచ్‌ఒ, కార్యాలయ అధికారులు ప్రయత్నించినా ఫలించలేదు. ఈ విషయం తెలిసిన ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్ అక్కడకు చేరుకుని నేతలతో చర్చించారు. బుధవారం రాత్రి వరకూ చర్చలు సాగుతూనే ఉన్నాయి.



డిఎంహెచ్‌ఒ కార్యాలయం వద్ద బైఠాయించిన ఎఎన్‌ఎంలు

నూజివీడుకు ఆర్కిడ్ ఇంటర్నేషనల్ స్కూల్ తలమానికం

తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఆర్కిడ్ స్కూల్‌ను ప్రారంభిస్తున్న తెలంగాణ మంత్రి, ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడుకి ఆర్కిడ్ ఇంటర్నేషనల్ స్కూల్ తలమానికమని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నూజివీడు పట్టణ పరిధిలో సరస్వతి ఆలయ సమీపంలో నూతనంగా నిర్మించిన ఆర్కిడ్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను ఆయన కృష్ణ గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌ఎసి ఆలపాటి రాజేంద్రప్రసాద్, దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్, కృష్ణ యూనివర్సిటీ రెక్టర్ ప్రొఫెసర్ మండవ వెంకట బసవేశ్వరరావుతో కలిసి బుధవారం అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్య అతిథి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇంటర్నేషనల్ స్కూల్‌ను గ్రామీణ ప్రాంతాలకు కూడా చేరువ చేయడం అభినందనీయమని, విద్యతోటే సమాజాభివృద్ధి జరుగుతుందని గత 35 సంవత్సరాల నుంచి శ్రీసిద్ధార్థ విద్యాసంస్థల నిర్వాహకులు సమాజానికి చేస్తున్న కృషిని కొనియాడారు. ఎంఎల్‌సి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఈ రోజున్న పోటీ ప్రపంచంలో టెక్నాలజీతో కూడిన విద్య అవసరమని, అన్ని సౌకర్యాలతో పాఠశాలను నిర్మించడం అభినందనీయమని పేర్కొన్నారు. కృష్ణ యూనివర్సిటీ రెక్టర్ ప్రొఫెసర్ ఎం.వి.బసవేశ్వరరావు కూడా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ ఛైర్మన్ కాపా శ్రీనివాసరావు, నూతక్కి వేణుగోపాలరావు, జనసేన నాయకుడు ముత్యాల కామేష్, సిపిఎం నాయకులు జి.రాజు, సిపిఐ నాయకులు సిహెచ్.రామారావు, ఆర్కిడ్ ఇంటర్నేషనల్ స్కూల్ ఛైర్మన్ మేడా మోహన్‌రావు, డైరెక్టర్లు డాక్టర్ గొల్లపూడి రవిబాబు, మేడా శ్రీహర్ష, దీప్తి, పాఠశాల ప్రిన్సిపల్ ఎంపి.రుక్మిణి, పట్టణ ప్రముఖులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

6 నుంచి డిఎస్‌సి పరీక్షలు

విస్తృతస్థాయిలో పకడ్బందీగా ఏర్పాట్లు

హాల్ టిక్కెట్‌లో తప్పులుంటే సరిదిద్దే అవకాశం

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు



జిల్లాలో ఈ నెల ఆరో తేదీ నుంచి ప్రారంభమయ్యే మెగా డిఎస్‌సి పరీక్షల నిర్వహణలో అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యమూ కలుగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. డిఎస్‌సి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లపై కలెక్టర్ ఛాంబర్ నుంచి టెలి కాన్ఫరెన్స్ ద్వారా విద్య, పోలీస్, విద్యుత్, రవాణా, రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖ తదితర అధికారులతో బుధవారం ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల ఆరో తేదీ నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే డిఎస్‌సి పరీక్షలకు జిల్లాలో సుమారు 17,584 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని డిఇఒను ఆదేశించారు. అభ్యర్థులకు ఏమైనా సందేహాలు లేదా వివరణల కోసం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ నెంబర్లను 90307234444, 9505644555 సంప్రదించవచ్చున్నారు. జిల్లాలో మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఏలూరులోని వట్లూరు సిద్ధార్థ క్విస్ట్ సిబిఎస్ఇ స్కూల్, వట్లూరు సర్ సిఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలోను, దుగ్గిరాలలోని ఏలూరు కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి గంటన్నర ముందుగా హాజరుకావాలని, హాల్ టిక్కెట్‌తోపాటు తప్పనిసరిగా ఆధార్ లేదా ఏదైనా గుర్తింపు కార్డును తీసుకురావాలని సూచించారు. అన్ని పరీక్షా కేంద్రాలవద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, మహిళా పోలీసులను కూడా నియమించాలని అన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా, హైస్పీడ్ నెట్ సదుపాయం ఉండాలని ఆదేశించారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా అదనపు బస్సులను నడపాలని ఆర్‌టిసికి సూచించారు.

తప్పులు సరిదిద్దుకునే అవకాశం ఉంది

డిఎస్‌సి హాల్‌టిక్కెట్‌లో ఏమైనా చిన్న తప్పులు నమోదై ఉంటే సరిదిద్దుకునే అవకాశం ఉందని, వాటికోసం అభ్యర్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ సూచించారు. ఏదైతే తప్పు నమోదైందో, దానికి సంబంధించిన ఒరిజనల్ సర్టిఫికెట్‌ను చూపించి, ధ్రువీకరించిన దాని జెరాక్స్ కాపీని అందజేసి, పరీక్షా కేంద్రం వద్దే సరిచేసుకోవచ్చునని చెప్పారు. తప్పులు సరిచేయించుకునేవారు గంటన్నర ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో ఎఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావు, డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, డిఇఒ ఎం.వెంకట లక్ష్మమ్మ, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ పి.సాల్మన్‌రాజు, డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఆర్.మాలిని, ఆర్‌టిసి డిపిటిఒ వరప్రసాదరావు పాల్గొన్నారు.

ఫాస్ట్ ట్యాగ్ లేదని బస్సు నిలిపివేత

అర గంటకుపైగా ప్రయాణికుల పడిగాపులు

ఉంగుటూరు : తణుకు డిపోకు నుంచి ప్రయాణీకులతో ఏలూరు వెళ్లేందుకు ఉదయం బయలుదేరిన బస్సును ఉంగుటూరు టోల్ ప్లాజా దాటే క్రమంలో నిర్వాహకులు ఫాస్ట్ ట్యాగ్ లేదని ఆపేసిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. తణుకు నుంచి ఏలూరు వెళ్లేందుకు సుమారు 25 మందికిపైగా ప్రయాణీకులు వివిధ స్టేజీల్లో బస్సు ఎక్కారు. బస్సు అద్దానికి ఫాస్ట్ ట్యాగ్ అంటించి లేకపోవడంతో టోల్ ప్లాజాలో స్కానింగ్ అవ్వకపోవడంతో గేటు తెరుచుకోలేదు. దీంతో బస్సు ముందుకు వెళ్లటానికి టోల్‌గేట్ నిర్వాహకులు ఒప్పుకోలేదు. ఈకారణంగా బస్సు వెనక్కి తీసి రోడ్డు పక్కన డ్రైవర్ ఆపేసి తణుకు డిపోకు సమాచారం ఇచ్చారు. ఇటీవల బస్సు అద్దం పగలడంతో డిపో గ్యారేజీలో అద్దాన్ని మార్చి కొత్తది బిగించారు. పాత అద్దానికి ఉన్న ఫాస్ట్ ట్యాగ్‌ను కొత్త అద్దానికి అతికించకుండా అదే బస్సు డాష్‌బోర్డుపై ఉంచారు. అయితే డ్రైవర్ కొత్తవాడు కావడంతో ఈ విషయం తెలియకపోవడంతో గందరగోళం ఏర్పడింది. ఎట్టకేలకు ఆ బస్సులోనే ఫాస్ట్ ట్యాగ్ దొరకడంతో దాన్ని అద్దానికి అంటించి బస్సు టోల్‌గేటును దాటి వెళ్లింది. ఈ తతంగా పూర్తయ్యే సరికి సుమారు అరగంట సమయం పట్టిందని అత్యవసరంగా ప్రయాణాలు చేసేవారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రతి వాహనానికి ఫాస్ట్ ట్యాగ్ మ్యాండెంట్ అని ట్యాగ్ లేకుండా టోల్‌గేటు దాటి వెళ్లడం కుదరదని టోల్‌ప్లాజా సిబ్బంది వెల్లడించారు.

పామాయిల్ దిగుమతి సుంకం తగ్గింపుతో రైతులకు నష్టం

ఎపి రైతు సంఘం జిల్లా నాయకుల ఆందోళన

ఏలూరు అర్బన్ : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పామాయిల్ దిగుమతి సుంకం 20 శాతం నుంచి 10 శాతానికి తగ్గించడం వల్ల ఆయిల్ పామ్ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు ఆందోళన వ్యక్తంచేశారు. బుధవారం ఏలూరు అన్నే భవనంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగులో దేశంలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉందన్నారు. ముడి పామోలిన్‌పై దిగుమతి సుంకం భారీగా తగ్గించడం వల్ల ఆయిల్ పామ్ గెలల ధర భారీగా తగ్గిపోతుందని చెప్పారు. ప్రస్తుత ధర రూ.20,290 నుంచి రూ.18,850 తగ్గిందని ఈ ధర మరో రూ.2 వేలకుపైగా తగ్గే ప్రమాదం ఉందన్నారు.ఆయిల్ పామ్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వర్జీనియా పొగాకు రైతులకు కంపెనీలు పొగ పెడుతున్నాయని విమర్శించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.సీతారామయ్య పాల్గొన్నారు.

దొంగతనం కేసులో పోలవరం పోలీసుల ప్రతిభ

రూ.33 లక్షల విలువైన బంగారం, వెండి, నగదు స్వాధీనం

నిందితుడి అరెస్ట్ : జిల్లా ఎస్పి ప్రతాప్ శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లా పోలీసులు గృహ దొంగతనంలో ప్రతిభ కనబరిచి మరోమారు పెద్ద మొత్తంలో రికవరీ చేసి పలువురు పోలీసులకు ఆదర్శంగా నిలిచారు. గృహ దొంగతనం కేసులో పోలవరం పోలీసులు రూ.33 లక్షల విలువైన బంగారం, వెండి నగదును స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేశారని జిల్లా ఎస్పి ప్రతాప్ శివకిషోర్ తెలిపారు. బుధవారం ఏలూరు నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పి స్వయంగా పాల్గొని తెలిపిన వివరాల ప్రకారం.. పోలవరం మండలం జగన్నాధపురం గ్రామానికి చెందిన పద్మనాభుని శ్రీనివాస గుప్తా స్థానికంగా వ్యాపారం చేస్తూ భార్య, పిల్లలతో కలిసి జీవిస్తున్నాడు. ఈక్రమంలో మే 13వ తేదీన ఆయన వ్యక్తిగత పనులపై రాజమండ్రికి వెళ్లి తిరిగి మరుసటి రోజు ఇంటికి వచ్చి చూసేటప్పటికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. ఇంట్లో ఉన్న బంగారం, వెండి నగదు అపహరణకు గురైనట్లు గుర్తించాడు. వెంటనే పోలవరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పోలవరం పట్టణ పరిధిలో వాహన తనిఖీలు చేస్తున్న పోలవరం సిఐ బాలసురేష్, ఎస్ఐ పవన్‌కుమార్‌లకు ఓవ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. వెంటనే అతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా గతంలో గృహ దొంగతనాలకు పాల్పడి జైలు జీవితం గడిపిన సస్పెక్ట్ షీటర్ ఉస్సురుమర్తి గంగాజలంగా అతన్ని గుర్తించారు. అతన్ని పూర్తిస్థాయిలో విచారించగా మే 13న జరిగిన గృహ దొంగతనం కేసులో అతను ప్రథమ ముద్దాయిగా గుర్తించి అతని వద్ద నుంచి 20047 గ్రాముల బంగారు ఆభరణాలను, రెండున్నర కేజీల వెండి ఆభరణాలను, రూ.7 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ నగదు, వెండి, బంగారు ఆభరణాలు ఇళ్లల్లో ఉంచుకుని వేరొక ప్రాంతాలకు వెళ్లడం సరైన పని కాదని, వేరొక ప్రాంతాలకు వెళ్లే సమయాలలో కచ్చితంగా లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం ద్వారా పోలీసులకు సమాచారం అందిస్తే వెంటనే పోలీసులు ఆ ఇంటికి కాపలా ఏర్పాటు చేస్తారన్నారు. దీంతో ఇటువంటి ఘటనలు జరగకుండా ఉంటాయని, ఇది పోలీస్ తరపున విన్నపమని ఆయన తెలిపారు. దాదాపు ఒక గృహ దొంగతనం కేసులో రూ.33 లక్షల విలువైన బంగారం, వెండి నగదులను రికవరీ చేసిన పోలవరం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావును, పోలవరం సిఐ బాల సురేష్ బాబును, ఎస్ఐ పవన్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, సత్యనారాయణ, కానిస్టేబుల్ బాబీ కోటేశ్వరరావు, మురళీకృష్ణలను జిల్లా ఎస్పి ప్రత్యేకంగా అభినందించారు. వారికి రివార్డులను కూడా అందించారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు 33/11 కెవి సామర్థ్యపు సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మత్తులు, విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న కొమ్మలు తొలగించుట కార్యక్రమాలను ఈనెల 6వ తేదీ శుక్రవారం చేపట్టనున్నట్లు ట్రాన్స్‌కో ఆపరేషన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అంబేద్కర్ తెలిపారు. దీని కారణంగా ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నామన్నారు. ఇదేక్రమంలో 11 కెవి గుండుగొలను, పారిశ్రామిక, నాగ హనుమాన్ పారిశ్రామిక, సూరప్పగూడెం హెడ్ క్వార్టర్స్ ఫీడర్లతోపాటు సూరప్పగూడెం, పొలసానిపల్లి వ్యవసాయ ఫీడర్ల పరిధిలో మరమ్మత్తులు కొనసాగుతాయన్నారు. దీని కారణంగా భీమడోలు, పొలసానిపల్లి, సూరప్పగూడెం, పాతూరు, దిగురుపాటి దెబ్బ ఆవాస ప్రాంతాలకు విద్యుత్ సరఫరాల అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తెలిపారు.

మున్సిపల్ కార్మికులకు రూ.21 వేల జీతం చెల్లించాలి

యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు బి.సోమయ్య

ప్రజాశక్తి - చింతలపూడి

మున్సిపల్ కార్మికులకు రూ.21 వేల జీతం చెల్లించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు, నాయకులు బి.సోమయ్య తెలిపారు. మండలంలో ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు సమావేశం సిఐటియు నాయకులు ఆర్‌విఎస్.నారాయణ అధ్యక్షతన స్థానిక చింతలపూడిలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలపూడి మున్సిపల్ కార్మికులకు అతి తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని, జిఒ ప్రకారం ఇవ్వవలసిన 21 వేల రూపాయల వేతనం చెల్లించడం లేదన్నారు. నగర పంచాయతీ అయిన దగ్గర నుంచి ఐదుగురు కమిషనర్లు మారినా.. కార్మికుల బతుకు అగాధంలోనే ఉందని తెలిపారు. ఇప్పటివరకు ఒక్కొక్క స్వీపర్‌కు రెండు లక్షల 50 వేల రూపాయలపైన పే ఎరియర్స్ బకాయి చింతలపూడి నగర పంచాయతీపై పడిందని, జిఒ నెంబర్ 36 ప్రకారం రూ.21 వేల వేతనం చెల్లించటంలేదని అన్నారు. వాటర్ వర్క్స్ సిబ్బందికి పెరిగిన జీతాల ప్రకారం ఒక్కొక్క కార్మికునికి రూ.48 వేల బకాయి పడిందని, వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే రాబోయేకాలంలో పోరాటానికి సిద్ధమవుతామని, సమ్మె చేయడానికి కూడా వెనకాడబోమని అన్నారు. పనిభారం పెంచారు గాని కార్మికుల జీతాలలో గాని, వారికి రావలసిన లక్షలాది రూపాయల బకాయిలపై మాట్లాడటం లేదని అన్నారు. కార్మికులకు ఇవ్వవలసినటువంటి క్యాజువల్ లీవులు గాని, పండుగ సెలవులు కానీ ఇవ్వడం లేదన్నారు. ఈ సమావేశానికి యూనియన్ గౌరవాధ్యక్షులు ఆర్‌విఎస్.నారాయణ పాల్గొన్నారు.

టిడిపి మండలాధ్యక్షునిగా నక్కనబోయిన వేణు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి



టిడిపి మండల అధ్యక్షులుగా మండల పరిధిలోని బొద్దనపల్లి గ్రామ మాజీ సర్పంచి, నియోజకవర్గ టిడిపి నాయకులు, బిసి సామాజిక వర్గానికి చెందిన నక్కనబోయిన వేణు ఎన్నికైయ్యారు. బుధవారం నూజివీడు నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో మండల అధ్యక్ష ఎన్నిక జరుగగా టిడిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు నక్కనబోయిన వేణుని ఆగిరిపల్లి మండల అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పార్టీని బలోపేతం చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

డివైడర్‌పై నిద్రిస్తున్న వ్యక్తిపైకి దూసుకొచ్చిన లారీ

అక్కడికక్కడే వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

డివైడర్‌పై నిద్రిస్తున్న వ్యక్తిపైకి పార్సిల్ సర్వీస్ లారీ దూసుకురావడంతో అతను మృతిచెందిన ఘటన బుధవారం ఉదయం ఏలూరు జాతీయ రహదారిలో రత్నస్ దాబా సమీపంలో చోటుచేసుకుంది. సంబంధిత వివరాల ప్రకారం ఏలూరు నగరంలోని అశోక్ నగర్ ప్రాంతంలో మంచినీళ్ల తోటకు చెందిన రొల్ల చంద్రరావు(44) గత కొద్దిరోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటినుంచి అతను ఏలూరు జాతీయ రహదారిలోని రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రత్న దాబా ఎదురుగా ఉన్న డివైడర్‌పై నిద్రిస్తూ కాలం వెళ్లదీస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం అతను డివైడర్‌పై నిద్రిస్తున్న సమయంలో యానాం నుంచి హైదరాబాద్ పార్సిల్ లోడుతో వెళ్తున్న ఓ పార్సిల్ లారీ ఒక్కసారిగా అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకొచ్చింది. దీంతో నిద్రిస్తున్న అతను ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆస్పత్రికి మార్చురీకి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరిస్థితి విషమించి మహిళ మృతి


ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పాముకాటుకు గురైన మహిళ చికిత్స పొందుతూ బుధవారం ఏలూరు సర్వజన ఆసుపత్రిలో మృతిచెందింది. పెదవేగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెదవేగి మండలం కూచింపూడి గ్రామానికి చెందిన తేళ్ల రాజమ్మ(35) భర్త శ్రీనివాసరావు, పిల్లలతో కలిసి కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తుంది. ఈక్రమంలో స్థానికంగా ఉన్న పామాయిల్ తోటలో పనులు చేసేందుకు మే 19వ తేదీన వెళ్లింది. ఆ క్రమంలో ఆమె పాము కాటుకు గురైంది గమనించిన తోటి కూలీలు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి ఆమె చికిత్స పొందుతుంది. పరిస్థితి విషమించి బుధవారం మధ్యాహ్నం ఆమె మృతిచెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. పెదవేగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఉషోదయ'లో తక్కువ ఫీజుతో కార్పొరేట్ విద్య

సంస్థ ఫౌండర్, ప్రిన్సిపల్ గుణ్ణం బుల్లెబ్బాయి

ప్రజాశక్తి - ఉంగుటూరు



ఉషోదయ పాఠశాల నిర్వాహకులు


గ్రామీణ ప్రాంతంలో తక్కువ ఫీజులతో కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే తమ పాఠశాల లక్ష్యమని ఉషోదయ హైస్కూల్ వ్యవస్థాపకులు, ప్రిన్సిపల్ గుణ్ణం బుల్లెబ్బాయి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో అందరికీ తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్య అందించడానికి 1991లో నారాయణపురం గ్రామంలో ఉషోదయ ఎడ్యుకేషనల్ సొసైటీని స్థాపించామన్నారు. సంస్థను తొలుత ప్రైమరీ విద్యతో ప్రారంభించారని తెలిపారు. ప్రైమరీ విద్యతో ఆరంభించి అంచలంచెలుగా హైస్కూల్ స్థాయికి ఎదిగిందన్నారు. సమీప గ్రామాలు, ఇతర మండలాల నుంచి విద్యార్థులను ఆకర్షించి మెరుగైన విద్యను అందిస్తూ అందరి అభిమానాన్ని చురగొన్నామని ఆయన తెలిపారు. సువిశాలమైన సొంత భవనాలు, విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు అతిపెద్ద ఆటస్థలం, సమీప గ్రామాల నుంచి విద్యార్థులను పాఠశాలకు చేర్చేందుకు సొంత బస్సు సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. క్రీడలు, సంగీతం, డ్యాన్స్, భగవద్గీత, కరాటేలో శిక్షణ ఇస్తున్నామన్నారు. బుల్లెబ్బాయ్, గీతావాణి దంపతులు తరగతి విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకుని సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. చదువుతో పాటు సమాజ సేవలపై విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమాలు హైస్కూల్ ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకూ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత, మండల స్థాయిలో మొదటి, రెండో స్థానం సాధిస్తున్నారన్నారు. ఈ ఏడాది స్కూల్ టాపర్‌గా పి.ఖ్యాతి సాయిశ్రీ, పదో తరగతి ఫలితాల్లో ఉషోదయ



ఉషోదయ హైస్కూల్

విద్యార్థులు విజయదుందుభి మోగించారని తెలిపారు. శశి విద్యాసంస్థల గ్రూప్ సిలబస్‌తో మరింత నాణ్యమైన బోధన చేపట్టనున్నామని వెల్లడించారు. 37 మందికి 35 మంది విద్యార్థులు 500పైబడి మార్కులు సాధించారని తెలిపారు. వారి విజయానికి స్కూలు డైరెక్టర్ గుణ్ణం గీతావాణీ సారథ్యంలో ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందన్నారు. తమ స్కూల్లో చదివిన పూర్వ విద్యార్థులు నేడు పారిశ్రామిక వేత్తలు, వైద్యులు, బ్యాంకర్లు, ప్రభుత్వ ఉద్యోగులుగా నిలవడం చాలా సంతృప్తి ఇస్తుందని గుణ్ణం బుల్లెబ్బాయ్, గీతావాణి దంపతులు తెలిపారు.

పలుచోట్ల 'సుపరిపాలన మొదలై ఏడాది'



భీమడోలు : మహిళకు బహుమతి అందజేస్తున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి - భీమడోలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం పూర్తిచేసుకున్న నేపథ్యంలో బుధవారం భీమడోలులో 'సుపరిపాలన మొదలై ఏడాది' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయం సంక్రాంతి తరహాలో, సాయంత్రం దీపావళి తరహాలో కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఉదయం ముంగిళ్లలో రంగవల్లులు వేయడం కార్యక్రమంతో పాటు, గత ప్రభుత్వ వైఫల్యాలను గుర్తుచేస్తూ భోగిమంటల తరహాలో మంటలు వేశారు. సాయంత్రం దీపావళి తరహాలో ఇళ్ల ముంగిట దీపాలు వెలిగించారు. ప్రస్తుత ప్రభుత్వం పట్ల తమ అభిమానాన్ని చాటుకుంటూ టపాసులు కాల్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఎ నియోజకవర్గ పరిధిలో గత సంవత్సర కాలంగా జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అనంతరం రంగవల్లుల పోటీలలో పాల్గొని ప్రతిభ కనబరిచిన మహిళలకు బహుమతులు అందజేశారు.

కొయ్యలగూడెం : 2024 ఎన్నికల ఫలితాలు విడుదలై కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరకాలం పూర్తికావడంతో మండలంలోని బయ్యన్నగూడెంలో సంబరాలు చేసుకున్నారు. టిడిపి మండల అధ్యక్షులు పారేపల్లి నరేష్ ఆధ్వర్యంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కూలీల సమక్షంలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించి అనంతరం వారికి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పారేపల్లి నరేష్ మాట్లాడుతూ సైకో ప్రభుత్వంపై తెలుగు ప్రజల తిరుగుబాటు ఓట్ల రూపంలో ప్రపంచానికి తెలియచేసిన ఓ చరిత్ర జూన్ 4, 2024 అని గుర్తుచేశారు. మండల ప్రజలందరికీ, కృషిచేసిన నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వేమ సత్తిబాబు, వార్డు సభ్యులు ఆనం సాయి, మల్లిపూడి శంకర్, బాలం గంగాధర్, పారేపల్లి బుజ్జిబాబు, ఉప్పాటి వెంకట్రావు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: ఈనెల 4వ తేదీన సరిగ్గా ఏడాది క్రితం రాక్షసపాలన పోయి రామరాజ్యం వచ్చిన రోజుగా, ప్రజలు ఓటు అనే ఆయుధంతో నియంత పాలనను అంతం చేసిన రోజుగా గుర్తించారని టిడిపి నాయకులు అన్నారు. జంగారెడ్డిగూడెం టిడిపి పట్టణ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్ అధ్యక్షతన కాకర్ల కాంప్లెక్స్ దగ్గర టిడిపి వ్యవస్థాపకులు, కీర్తిశేషులు నందమూరి తారక రామారావు విగ్రహానికి పట్టణ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్, సీనియర్ నాయకులు రావూరి కృష్ణ, పరిమి సత్యనారాయణ, పెనుమర్తి రామ్‌కుమార్, కౌన్సిలర్స్ నంబూరి రాజు, తెలగారపు జ్యోతి, వలవల తాతాజీ, గుమ్మడి ప్రసాద్, స్టేట్ బిసి డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరావు, కొప్పాక శ్రీనివాసరావు పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. సాయిల సత్యనారాయణ, షేక్ పీర్లు, అల్లూరి రామకృష్ణ, మద్దిపాటి నాగేశ్వరావు, మహంకాళి రాంబాబు పాల్గొన్నారు.



కలిదిండిలో..

కలిదిండి : కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది ఐన సందర్భంగా మండలంలోని కోరుకొల్లు లో జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, సర్పంచి బట్టు లీలా కనక దుర్గ ఆధ్వర్యంలో జెడ్‌పి హైస్కూల్ ఆవరణలో రంగవల్లుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. మట్టగుంటలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. నాయకులు బెల్లంకొండ వెంకన్న, నల్ల గోపుల చలపతిరావు, వలవల రామారావు, బట్టు మహేష్, తిరుమాని గోపాలకృష్ణ, రాంబాబు, పరశురాముడు, గణపతి, వీర్రాజు, తాతారావు పాల్గొన్నారు.

ముసునూరు: టిడిపి అధికారంలోకి వచ్చి సంవత్సరకాలం విజయవంతంగా పూర్తి అయిన సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో విజయోత్సవ ర్యాలీ కార్యక్రమాలు నిర్వహించి అనంతరం కేక్ కటింగ్ చేశారు. నాయకులు, కార్యకర్తలు సీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొల్లి గంగారం, మందలపు ధర్మరాజు, మందలపు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇండియన్ బ్యాంక్ నూతన మేనేజర్‌గా గోపాలరావు బాధ్యతలు

మండవల్లి : ఇండియన్ బ్యాంక్ మండవల్లి శాఖకు నూతన మేనేజర్‌గా కె.గోపాలరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇండియన్ బ్యాంక్ శాఖ నిర్వహించిన బదిలీలలో ప్రకాశం జిల్లా బోట్ల గూడూరు బ్రాంచి ఇండియన్ బ్యాంక్ శాఖ మేనేజర్‌గా పనిచేస్తున్న గోపాలరావు మండవల్లికి బదిలీ చేశారు. ఇప్పటివరకు మండవల్లి శాఖ ఇండియన్ బ్యాంక్ మేనేజర్‌గా విధులు నిర్వహించిన కె.జ్యోతిప్రసాద్ మచిలీపట్నం మెయిన్ బ్రాంచికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ఎస్.భాస్కరరావు, రిటైర్డ్ హెచ్ఎం కె.సూర్రావు, కన్వీనర్ అప్పారావు, గుప్తాలతోపాటు పలువురు ఖాతాదారులు గోపాలరావును మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలతో దుశాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రావు మాట్లాడుతూ బ్యాంక్ పరిధిలోని గ్రామాలలో పేద, బడుగు, మధ్యతరగతికి చెందిన ప్రజలు ఇండియన్ బ్యాంకులో ఖాతాదారులుగా ఉన్నారని, రైతులకు, డ్వాక్రా సంఘాల మహిళలకు, చిరు వ్యాపారులకు రుణాలను త్వరితగతిన మంజూరు చేసి సహకరించాలని కోరారు. ప్రధానమంత్రి సామాజిక భద్రత పథకాలైన ప్రధానమంత్రి సురక్ష యోజన, జీవన్ జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాలను ప్రజలకు తెలియజేసి, ఈ పథకాలలో ప్రజలు నమోదు చేసుకునే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.



గోపాలరావును సత్కరిస్తున్న భాస్కరరావు, తదితరులు

కొనసాగిన వేసవి విజ్ఞాన తరగతులు

ఏలూరు సిటీ : ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు (సమ్మర్ ఓరియంటేషన్ కార్యక్రమం) 32వ రోజు ఎంతో సందడిగా నిర్వహించారు. విద్యార్థులకు ముందుగా పుస్తక పఠనంలోని దేశనాయకుల జీవిత చరిత్రలు, కథలు చదవడం, కథలు చెప్పడం జరిగాయి. అనంతరం రిసోర్స్‌పర్సన్ డి.శ్రీవల్లి విద్యార్థులకు యోగా మన శరీరానికి మానసిక ప్రశాంతతను ఇస్తుంది కాబట్టి ప్రతిరోజు ఉదయాన్నే కాసేపు సమయాన్ని యోగాసనాలపై దృష్టిపెట్టాలని శిక్షణ అందించారు. తదుపరి రిసోర్స్‌పర్సన్లు డి.శ్రీవల్లి, వివిఎన్.సాయి కుమార్ కలిసి విద్యార్థులకు స్వర్ణాంధ్ర-2047 అనే అంశంపై క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులను డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు పర్యవేక్షించారు.

గురజలో చెరువు అక్రమ తవ్వకం

పంట నష్టపోతామని రైతుల ఆవేదన

ప్రజాశక్తి - ముదినేపల్లి

రెండు పంటలు పండే పచ్చని పంటపొలాలను బడా బాబులు ఆక్వా చెరువులుగా మారుస్తున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా పంట పొలాలను ఆక్వా చెరువులుగా తవ్వుతున్నారు. గురజ గ్రామానికి చెందిన ఎన్‌డియే కూటమికి చెందిన వ్యక్తి అనుమతి లేకుండా ఆక్వా చెరువు తవ్వుతున్నాడు. ఈ చెరువు తవ్వకం వల్ల సరిహద్దు పొలాల రైతులు పంట నష్టపోయే అవకాశం ఉందంటున్నారు. ఈ ఆక్వా చెరువు అక్రమ తవ్వకం కారణంగా తాము పంట నష్టపోయే అవకాశం ఉందని గ్రామానికి చెందిన పలువురు రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి పనులను నిలుపుదల చేయాలని గ్రామానికి చెందిన పలువురు రైతులు రెవెన్యూ అధికారులను కోరుతున్నారు.

చెరువు తవ్వకం నిలుపుదల చేశాం : విఆర్ఒ


గురజలో జరుగుతున్న అక్రమ చెరువు తవ్వకం విషయమై గ్రామ విఆర్ఒ కె.కిషోర్ వివరణ కోరగా చెరువు తవ్వకం చేస్తున్న ప్రోక్లైన్‌ను బయటికి పంపించి వేసి చెరువు తవ్వకం పనులు నిలుపుదల చేసినట్లు విఆర్ఒ కిషోర్ తెలిపారు. చెరువు తవ్వకుండా గ్రామ విఆర్ఎలను కాపాల ఉంచినట్లు తెలిపారు.



అనుమతి లేకుండా తవ్విన ఆక్వా చెరువు

అమలు కాని సూపర్ సిక్స్ హామీలతో వెన్నుపోటు

పలుచోట్ల 'వెన్నుపోటు దినం'




ఉంగుటూరు : తహశీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

మోసపూరిత ఎన్నికల హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు లేవు, శాంతి భద్రతలు గతి తప్పాయి, అధికారులపై వేధింపులు, అక్రమ కేసులు, అరెస్టులు యథేచ్ఛగా రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు, ప్రశ్నించే గొంతులను నొక్కుతున్నారని వైసిపి పిఎసి సభ్యుడు, ఉంగుటూరు మాజీ ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు విమర్శించారు. ఆపార్టీ రాష్ట్రవ్యాప్త వెన్నుపోటు దినం పేరిట పిలుపులో భాగంగా బుధవారం వాసుబాబు ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు జాతీయ రహదారి ఉంగుటూరు నుంచి పాదయాత్ర చేపట్టి తహశీల్దార్ కార్యాలయానికి చేరింది. అక్కడ తహశీల్దార్ పాలపర్తి రవికుమార్‌కు వినతిపత్రాన్ని వాసుబాబు అందజేశారు. అనంతరం ప్రజలనుద్దేశించి వాసుబాబు మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలు, రైతులు ఇలా అన్ని తరగతులు తిరోగమణంతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో అభివృద్ధి శూన్యమని దుయ్యబట్టారు. పథకాలు అమలు చేయకపోగా ఏడాదికి రూ.1.50 లక్షల కోట్లు అప్పులు చేశారని చంద్రబాబు పాలనను ఎద్దేవా చేశారు. రైతు భరోసా, అమ్మఒడిని దూరం చేశారు. ఆడబిడ్డ నిధిలో 18 ఏళ్లు దాటిన ప్రతి మహిళలకు రూ.1500 ఇస్తామని బూటకపు హామీలతో జనాలను మోసం చేయడం వెన్నుపోటు కాదా అని వాసుబాబు ప్రశ్నించారు. ఎంపిటిసి సభ్యులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరైయ్యారు. పెదబాబు, మండల అధ్యక్షులు మరడ వెంకట మంగారావు, సంకు సత్యకుమార్, జెడ్‌పిటిసి సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి, పాపారావు బాబ్జి, పుప్పాల గోపీ పాల్గొన్నారు. అంతకుముందు ఉంగుటూరులో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి దండ వేశారు.

ఏలూరు సిటీ : ఏలూరులోని వైసిపి ఆధ్వర్యంలో బుధవారం వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా వైసిపి కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం గడుస్తున్న సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారని మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం ప్రతి ఒక్క హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏలూరు వైసిపి పార్లమెంటు పరిశీలకులు వంకా రవీంద్ర, నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసరావు, బిసి అధ్యక్షుడు చిరంజీవి పాల్గొన్నారు.



నూజివీడు టౌన్‌లో..

నూజివీడు టౌన్ : ఏడాది కాలంగా కూటమి ప్రభుత్వ వెన్నుపోటు పాలనలో రాష్ట్రం కోలుకోలేని విధంగా అతలాకుతలం అయిందని, పేదలకు ఒక్క పథకం కూడా అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం కల్లబొల్లి కబుర్లు చెప్తూ కాలక్షేపం చేస్తోందని మాజీ ఎంఎల్ఎ, వైసిపి నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ధ్వజమెత్తారు. ద్వారకా సెంటర్ వద్ద నుంచి చిన్నగాంధీబొమ్మ సెంటర్, పొట్టి శ్రీరాములు బొమ్మ సెంటర్, పెద్దగాంధీబొమ్మ సెంటర్ మీదుగా శ్రీనివాస సెంటర్ వరకు పాదయాత్రగా ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్రగా వెళ్లి కార్యాలయ ఎఒ ఉదయ్ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు.



ఏలూరు సిటీలో..

చింతలపూడి : కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయినా కూడా ఒక్క హామీని ఇవ్వకపోవటం వెన్నుపోటు కాదా అని వైసిపి కన్వీనర్ విజయరాజు అన్నారు. చింతలపూడిలో భారీగా నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమం సందర్భంగా మార్కెట్ యార్డ్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు అమలు చేసి ప్రజలను ఆదుకోవాలని తహశీల్దార్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏడాదిలో అమలు చేస్తే కూటమి ప్రభుత్వం హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని వెన్నుపోటు అని అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దెందులూరు : దెందులూరు నియోజకవర్గ మాజీ ఎంఎల్ఎ కొఠారు అబ్బాయ్య చౌదరి ఆదేశాలతో వైసిపి నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి పార్టీ నాయకులు, అభిమానులు భారీగా తరలి వచ్చారు. ఏలూరులోని దెందులూరు నియోజకవర్గ కార్యాలయం వద్ద నుంచి పెదపాడు మండల తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్‌కు కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో మండల జెడ్‌పిటిసిలు, లీలా కాంతం పాల్గొన్నారు.

అల్లంచర్లలో గ్యాప్ ఏరియా భూములు పేదలకు పంచాలి : సిపిఎం

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని అల్లంచర్లరాజుపాలెం పంచాయతీలో గ్యాప్ ఏరియాలో ఉన్న ఖాళీ భూములను పేదలకు పంచాలని సిపిఎం జిల్లా నాయకుడు గుడిపెల్లి వెంకట్రావు డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అల్లంచర్ల రాజుపాలెం అటవీ ప్రాంతంలో అటవీ, రెవెన్యూ శాఖలు గతంలో సర్వే చేయకుండా మిగిలి ఉన్న భూములను అధికారులు ఇటీవల సర్వే చేసి, సుమారు 1,100ల ఎకరాలు ఉన్నట్లు గుర్తించారన్నారు. అవి ఏపి గ్రామాలకు సమీపంలో ఉన్నాయని అధికారులు గుర్తించి వెంటనే వాటిని ఆయా గ్రామాల్లో ఉన్న అర్హులైన పేదలకు పంపిణీ చేయాలన్నారు. మండలంలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని వాటిని కూడా పేదలకు పంచాలని, ఇప్పటికే పేదల సాగులో ఉన్న భూములకు హక్కు పత్రాలు మంజూరు చేయాలని కోరారు.

వెలగపాడులో బోరు మోటారు ఏర్పాటు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని వెలగపాడు ఎస్‌సి కాలనీలో స్థానికులు ఎదుర్కొంటున్న తాగునీటి కష్టాలను పంచాయతీ సిబ్బంది పరిష్కరించారు. కాలనీలో కొద్దికాలం క్రితం బోరు పాడవటంతో గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తింది. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్న క్రమంలో పంచాయతీ సర్పంచి, సిబ్బంది స్పందించి పంచాయతీ నిధులతో గ్రామంలో బోరు మోటారు ఏర్పాటు చేయించారు. నూతనంగా ఏర్పాటు చేసిన మోటారును టిడిపి రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు చేతుల మీదుగా బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నైనారపు జలపాలు, పంచాయతీ కార్యదర్శి రవివర్మ, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

ప్రాజెక్టు గేట్లను తనిఖీ చేయాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలోని అన్ని ప్రాజెక్టు గేట్లు పనిచేసే స్థితిలో ఉన్నదీ, లేనిదీ తనిఖీ చేసి నివేదిక అందజేయాలని ఇరిగేషన్ ఇంజినీర్లను జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. బుధవారం జిల్లాలోని తమ్మిలేరు, ఎర్రకాలువ, కొవ్వాడ కాలువ ప్రాజెక్ట్‌లకు సంబంధించి సంబంధిత ఇరిగేషన్ ఇంజినీర్లతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉప్పుటేరును ఏలూరు ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఇ, అటవీశాఖాధికారి, ఆర్‌డిఒ కలిసి సంయుక్తంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. తమ్మిలేరు తూర్పు, పశ్చిమ ప్రాంతాల్లో తూడును వారం రోజుల్లోపు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గత వరదల కాలంలో జరిగిన నష్టాలను సంబంధిత అధికారులు ధ్రువీకరించి ప్రతిపాదనలు వెంటనే సమర్పించాలన్నారు. ఏలూరు పట్టణ పరిధిలో వరదల సమయంలో నివాస ప్రాంతాలను ప్రభావితం చేసే అన్ని చెక్ డ్యామ్‌లను పరిశీలించాలన్నారు. గత సెప్టెంబరు నెలలో వరదలు సంభవించినప్పుడు నూజివీడు నగర పరిధిలోని మైనర్ ఇరిగేషన్ ట్యాంకులకు పడిన గండ్లను నాణ్యతతో పూడ్చివేయాలని విజయవాడ ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఇని ఆదేశించారు. ఈ సందర్భంగా విజయవాడ ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఇ ఆర్.మోహన్‌రావు మాట్లాడుతూ నూజివీడు పట్టణ పరిధిలోని మొగల్ చెరువు కాలువలు ఆక్రమణల మూలంగా ఇరుకయ్యాయని, ఫలితంగా ఇళ్లు ముంపునకు గురవుతున్నాయని తెలిపారు.య దీనిపై కలెక్టర్ స్పందిస్తూ సంబంధిత ఆక్రమణల తొలగింపునకు నూజివీడు సబ్ కలెక్టర్‌తో కలిసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఏలూరు ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఇ నాగార్జునరావు, ఇఇ సిహెచ్.దేవప్రకాష్, డిఇఇ వై.అర్జునరావు, డిఇలు, ఎఇలు పాల్గొన్నారు.

మహిళల భద్రత అందని ద్రాక్ష

ఎపి మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల

కుక్కునూరు : దేశంలో మహిళలకు, చిన్నారులకు ప్రభుత్వం కల్పిస్తున్న భద్రత అందని ద్రాక్షలా ఉందని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏర్పడి 70 వసంతాలు పూర్తయిన సందర్భంగా మండలంలో పలుచోట్ల వేడుకలు ఘనంగా జరిగాయి. రాయికుంట గ్రామంలో మహిళా నాయకులు కంటిపల్లి లక్ష్మి జెండా ఆవిష్కరించారు. అనంతరం శ్యామల మాట్లాడుతూ దేశంలో మహిళలకు ఎన్నో ఉన్నతమైన, విలువైన చట్టాలు కల్పించినా అఘాయిత్యాలకు పాల్పడుతున్న మృగాల్లకు శిక్ష పడటంలో మాత్రం చట్టాలు సరిగా అమలుకావడం లేదని అన్నారు. మహిళా సమాఖ్య ద్వారా మహిళలకు ప్రత్యేక హక్కుల సాధన కోసం అనేక పోరాటాలు, ఉద్యమాలు చేపట్టామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కుక్కునూరు మండల సమితి కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య, మొడియం లక్ష్మి, సోడే రాములమ్మ పాల్గొన్నారు.

సారా తయారుచేస్తే కఠిన చర్యలు

ఎక్సైజ్ ఎస్ఐ జి.పాండురంగారావు

చింతలపూడి : సారా తయారుచేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ సూపరిటెండెంట్ ఆఫ్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎస్ఐ జి.పాండురంగారావు తెలిపారు. చింతలపూడి సిఐ పి.అశోక్, స్టేషన్ ఎస్ఐలు, సిబ్బంది, మధ్యవర్తుల సమక్షంలో రాబడిన సమాచారం మేరకు మండలంలోని కాంచనగూడెం గ్రామంలో దాడులు నిర్వహించగా మారుమూడి నాగబాబు వద్ద నుంచి 5 లీటర్ల ఇఎన్ఎ స్పిరిట్(ఎక్స్ట్రా న్యూట్రల్ ఆల్కహాల్ స్పిరిట్), కాంచనగూడెం గ్రామంలో కాలబత్తుల అనిత వద్ద నుంచి లీటరు ఇఎన్ఎ స్పిరిట్, ప్రగడవరం గ్రామంలో కాగిత నాగేశ్వరమ్మ వద్ద నుంచి 5 లీటర్ల ఇఎన్ఎ స్పిరిట్, లింగపాలెం మండలం అన్నపనేనివారిగూడెంలో బేతు రమేష్ వద్ద నుంచి 7 లీటర్ల ఇఎన్ఎ స్పిరిట్ మొత్తం 18 లీటర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సదరు ఇఎన్ఎ స్పిరిట్‌ను నల్లజర్ల మండలం ఆవుపాడు డిస్టిలరీ నుంచి చోరీ చేసి చిట్లూరి కిశోర్ అను వ్యక్తి సరఫరా చేస్తున్నట్టుగా విచారణలో తేలిందన్నారు. అతని వద్ద నుంచి 2 లీటర్ల ఇఎన్ఎ స్పిరిట్ మొత్తం ఐదుగురు వద్ద 20 లీటర్లు స్వాధీన పరచుకొని, వారి ఐదుగురుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.